బుధవారం
22 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:96
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

చమురు
దిగుమతుల్లో భారీ పతనం -



## పటాకుల తయారీ కేంద్రంలో పేలుడు

**కేరళలోని ముండతికోడ్‌లో ఘటన**
**13 మంది మృతి.. 40 మందికి పైగా గాయాలు**
**ఆసుపత్రికి తరలింపు.. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమం**
**ఘటనపై సీఎం విజయన్ దిగ్భ్రాంతి**



త్రివేంద్రం, ఏప్రిల్ 21: తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలోని ఓ పటాకుల తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి 25 మంది కార్మికులు మృతిచెందిన ఘటన మరువకముందే కేరళలో మరో ప్రమాదం సంభవించింది. మంగళవారం మధ్యాహ్నం కేరళలోని త్రిస్సూర్ జిల్లా ముండతికోడ్‌లోని పటాకుల తయారీ కేంద్రంలోనూ పేలుడు జరిగింది. పేలుడు ధాటికి మృతదేహాలు ఛిన్నాభిన్నమై చెల్లాచెదురుగా సమీపంలోని పొలాల్లో పడిపోయాయి.ప్రమాదంలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. రెస్క్యూ సిబ్బంది క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు

వివరాలు2లో..

## గాయాల పునాదులపై నేపాల్ పునర్నిర్మాణం




ఒకవైపు వేళ్లూనుకుపోయిన అవినీతి, రాజకీయ నాయకుల ఆడంబర జీవనం, విదేశాల్లో షికార్లు, ఉన్నత వర్గాల చేతుల్లోనే బందీ అయిన అధికారం, బంధుప్రీతి.. మరోవైపు నిరుద్యోగం, చేసేందుకు సత్తువ ఉన్నా చేయడానికి పనిలేని దుస్థితి, పూట గడుపుకొనేందుకు పొట్టచేతబట్టుకొని దేశదేశాలకు తిరగాల్సిన పరిస్థితి.. వెరసి తమ దేశంలోని పరిస్థితులను చూసి నేపాల్ యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది.యువత నిరాశ, నిస్పృహల నుంచి నిప్పు రాజుకుంది. హిమాలయ దేశం రణరంగంగా మారింది. దశాబ్దాలుగా అధికార పీఠంపై పాతుకుపోయిన సంప్రదాయవాదులను పునాదులతో సహా పెకిలించారు నేపాల్ యువత. ఇది నాటి మాట. మరి నేడు, విధ్వంసపు పునాదుల మీద కొత్త ఆశల విత్తులను మొలకెత్తిస్తున్నారు యువతరం. కొత్తగా ఎన్నికైన యువ నేతల సారథ్యంలో నేపాల్ మార్పు దిశగా అడుగులు

వివరాలు2లో..

## నేడు శాంతిచర్చలు

అమెరికా, ఇరాన్ మధ్య రెండో విడత భేటీ?
ఇస్లామాబాద్‌కు బయల్దేరిన ఇరు దేశాల బృందాలు: పాక్
ఇరాన్‌కు వేరే మార్గం లేదు.. చర్చలకు రావాల్సిందే: ట్రంప్
చర్చలకు వచ్చే ప్రసక్తే లేదు: ఇరాన్
రేపు రాత్రితో సీజ్‌ఫైర్ ఒప్పందం గడువు పూర్తి




టెహ్రాన్/ ఇస్లామాబాద్/ వాషింగ్టన్, ఏప్రిల్ 21: అమెరికా- -ఇరాన్ మధ్య శాంతి చర్చలపై ఎడతెగని ఉత్కంఠ కొనసాగు తున్నది. దౌత్యమార్గాల ద్వారా సమస్యను పరిష్కరించేందుకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్ వేదికగా రెండో విడత చర్చలు జరగాల్సి ఉండగా, చర్చలపై సందిగ్ధత నెలకొన్నది. అమెరికా నుంచి ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం, ఇరాన్ నుంచి పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ ఘాలిబఫ్ బృందం ఇస్లామాబాద్‌కు బయల్దేరాయని పాకిస్థాన్ స్పష్టం చేసింది.చర్చల కోసం ఇస్లామాబాద్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రకటించింది. జేడీ వాన్స్ బృందం పాక్ ప్రయాణానికి సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ, శాంతిచర్చలపై ఇరాన్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. బుధవారం రాత్రితో అమెరికా ఇరాన్ మధ్య రెండువారాల తాత్కాలిక కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్)

వివరాలు2లో..

## ప్రధాని మోడీపై సభాహక్కుల ఉల్లంఘన నోటీస్

**-- లోక్‌సభకు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్**



న్యూఢిల్లీ బ్యూరో : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు కాంగ్రెస్ ఎంపి కె.సి వేణుగోపాల్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు రూల్ 222 కింద ప్రివిలేజ్ నోటీసు అందచేశారు. ఏప్రిల్ 18న దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. ఆ ప్రసంగంలో ఆయన ప్రతిపక్షాలను తప్పుపట్టారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపక్షాల వల్లే వీగిపోయిందని, దీనివల్లే మహిళా రిజర్వేషన్ బిల్లుకు క్లియరెన్స్ దక్కలేదని తన ప్రసంగంలో ఆరోపించారు. మోడీ తన టీవీ ప్రసంగంలో ప్రతిపక్షాలను తప్పుపట్టడం అనైతికమని, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అవుతుందని ఆయన ఆరోపించారు. బిల్లు వీగిపోవడానికి కారణం ప్రతిపక్షాలు అని చెప్పడం సభాహక్కుల ఉల్లంఘన అవుతుందని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయని, కానీ ప్రభుత్వం తెచ్చిన డీలిమిటేషన్ బిల్లును మాత్రమే తాము వ్యతిరేకించినట్లు వేణుగోపాల్ తెలిపారు. 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని ప్రతిపక్షాలు కోరినట్లు ఆయన చెప్పారు. 106వ రాజ్యాంగ సవరణతో ఏర్పడిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కోరాయని, కానీ ప్రభుత్వం మాత్రం విపక్షాలపై నెపంవేసి ప్రధాని సభహక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు తెలిపారు. పార్లమెంట్ విధుల ప్రకారం తాము ఓటింగ్‌లో పాల్గొన్నామని, కానీ ప్రభుత్వం తమ బిల్లు ఓడిపోవడానికి ప్రతిపక్షాలు కారణమని చెప్పడం

వివరాలు2లో..

## రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

**తమిళనాడులో అన్ని స్థానాలకు బెంగాల్‌లో తొలి దశలో 152 సీట్లకు పోలింగ్**

కోల్‌కతా, చెన్నై: తమిళనాడు ఒకే విడత ఎన్నికలకు, పశ్చిమ బెంగాల్ మొదటి దశ ఎన్నికలకు ప్రచారం మంగళవారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడత 152 సీట్లకు ఈ నెల 23న జరిగే ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు అధికారులు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో సర్, ప్రజల ఆహార అలవాట్లు కేంద్రంగా మొదటి విడత ప్రచారం ప్రధాన ప్రత్యర్థులైన అధికార టీఎంసీ, విపక్ష బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు పోటీపడి వాగ్దానాలు గుప్పించాయిఈ రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ కూడా రంగంలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీఎంసీ-బీజేపీ మధ్యే జరుగుతున్నది. మొదటి విడతలో 3.60 కోట్ల మంది ప్రజలు ఓటును వినియోగించుకోనున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సందర్భంగా రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలకు చెందిన 2.5 లక్షల మందిని మోహరించారు. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టాలని మమతా

వివరాలు2లో..



## పోలవరం ఏ 45.72 మీటర్లు


**ప్రాజెక్టు పూర్తయితే కుడి కాలువ కింద 3.29 లక్షల ఎకరాలకు సాగునీరు**
**ఎడమ కాలువ కింద 4 లక్షల ఎకరాలకు..**
**10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ**
**13 లక్షల ఎకరాల కృష్ణా ఆయకట్టు కూడా**

అమరావతి, : పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మిస్తారా.. 194.60 టీఎంసీల నీటి నిల్వ ఉంటుందా లేదా అన్న సందేహాలకు తెరపడింది. 45.72 మీటర్ల గరిష్ఠ కాంటూరులో ప్రాజెక్టు పూర్తవుతుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) మొట్టమొదటిసారి అధికారికంగా పేర్కొంది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు గత నెల 25వ తేదీన ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సందర్శించాక

వివరాలు2లో..



## ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల్లో 19 మన దేశంలోనే




న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు భారత్ ప్రస్తుతం కేంద్ర బిందువుగా ఉంది. మన దేశంలోని అనేక నగరాలు నిప్పుల కుంపటిగా మారుతున్నాయి. ప్రస్తుతం చాలా వరకు నగరాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఏక్యూఐ

వివరాలు2లో..

## పటాకుల తయారీ కేంద్రంలో పేలుడు

మొదటి పేజీ తరువాయి

తరలించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఈ తయారీ కేంద్రం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో పొలాల మధ్య ఉంది. పేలుడు శబ్దం కొన్ని కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. దట్టమైన పొగ కారణంగా స్థానికులు ఇబ్బంది పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కేరళ విపత్తు నిర్వహణ సంస్థ మృతదేహాలను గుర్తించే పనిలో పడింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అక్కడి యంత్రాంగం చెబుతోంది. త్రిస్సూర్ ప్రాంతంలో త్వరలో జరిగే పూరం పండుగ కోసం కార్మికులు పటాకులు తయారు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నది. ప్రమాదంపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పించాలని సూచించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ప్రమాదంపై కలెక్టర్ శిఖా సరేంద్రన్ మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. ముండతికోడ్ పోలీసులు కూడా దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై విచారిస్తున్నారు.

## ప్రధాని మోడీపై సభాహక్కుల ఉల్లంఘన నోటీస్

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని, రాజ్యాంగంలోని 105వ అధికరణ ప్రకారం ఓటు వేసిన సభ్యులకు ఎటువంటి కారణాలను ఆపాదించరాదని వేణు గోపాల్ అన్నారు. ప్రధానితో సహా ఎవరికైనా ఆ ఆర్టికల్ వర్తిస్తుందన్నారు. పార్లమెంట్, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు స్పీకర్ ఓం బిర్లా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల్లో 19 మన దేశంలోనే

మొదటి పేజీ తరువాయి

మంగళవారం మధ్యాహ్నం విడుదల డేటా ప్రకారం... మంగళవారం నాడు వరకు చూస్తే, ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల్లో 19 భారత్‌లోనే ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, బుధవారం (ఏప్రిల్ 22) నుంచి మూడు రోజుల పాటు వడగాడ్పుల పరిస్థితి కొనసాగుతుందని అంచనా వేసింది. బిహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లోని నగరాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా పెరిగాయి. పలు చోట్ల 44 డిగ్రీలను కూడా తాకిన పరిస్థితులు నెలకొన్నాయి. బిహార్‌లోని భాగల్‌పూర్, ఒడిశాలోని తాల్చేర్, పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఇంకా బిహార్‌లోని బెగుసరాయ్, మోతిహరి, ముంగేర్ లాంటి నగరాలతో పాటు పశ్చిమ బెంగాల్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు 43డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు చేశాయి. ప్రపంచంలోని టాప్-20 అత్యంత వేడి నగరాల్లో భారతదేశ వెలుపల ఉన్న ఒకే ఒక్క నగరం నేపాల్‌లోని లుంబిని కావడం గమనార్హం.

# నేడు శాంతిచర్చలు

మొదటి పేజీ తరువాయి

గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య చర్చలు ఉంటాయా.. లేదా అనే అంశం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. సమయం లేదు: ట్రంప్‌శాంతిచర్చలకు రావడం తప్ప ఇరాన్‌కు మరో దారి లేదని, వారు చర్చలకు వచ్చినా, రాకున్నా తమకు మాత్రం కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే ఆలోచనే లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పారు. ఇరాన్ నాయకత్వం కోరుకుంటే, స్వయంగా తానే ఆ దేశ బృందంతో భేటీ అవుతానని సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఆ దేశం మాట వినకుంటే, ఆ దేశంపై బాంబు దాడులు తప్పవని హెచ్చరించారు. అమెరికా సైన్యం ఇప్పటికే అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నదని, తాను ఆదేశిస్తే తిరిగి యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. దిగ్బంధాన్ని సహించం : ఘాలిబఫ్ఇస్లామాబాద్ వేదికగా జరగాల్సిన రెండో విడత శాంతి చర్చలకు ఇరాన్ ఇప్పటికీ మెత్తబడలేదు. చర్చలకు ఆ దేశం ససేమిరా అంటున్నది. అమెరికా విధిస్తున్న అలవిగాని షరతులు, తమ ఓడరేవులు, హోర్ముజ్ జలసంధి దిగ్బంధం తమను బాధించిందని స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమను బెదిరించలేరని, చర్చలకు అంగీకరించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ఒకవైపు చర్చలకు ఆహ్వానిస్తూనే, మరోవైపు అమెరికన్ సైన్యం తమ నౌకలపై దాడులు చేయడమేంటని నిలదీశారు. టెహ్రాన్ లొంగిపోయేలా ఒత్తిడి చేసి, యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే, ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫాతిమా స్పందిస్తూ.. తమ చేతులు తుపాకీ ట్రిగ్గర్ మీదనే ఉన్నాయని, అమెరికా బెదిరింపులకు తాము లొంగేది లేదని తేల్చిచెప్పారు.

## చమురు దిగుమతుల్లో భారీ పతనం

న్యూఢిల్లీ : ఇరాన్‌తో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా నిలిచిపోవడంతో భారత్ ముడిచమురు దిగుమతులు భారీగా తగ్గాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చిలో దిగుమతులు 13 శాతం క్షీణించి రోజుకు 4.5 మిలియన్ బారెల్స్‌కు పరిమితమయ్యాయిఅమెరికా యుద్ధం కారణంగా పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చే సరఫరా 61 శాతం మేర పడిపోవడంతో ఆ లోటును భర్తీ చేసేందుకు భారత్ రష్యా నుంచి మొత్తం చమురులో రష్యా వాటా దాదాపు సగానికి లేదా 2.25 మిలియన్ బారెల్స్‌కు చేరింది. హోర్ముజ్ జలసంధిలో అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన కారణంగా నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. గత రెండు నెలల్లో కేవలం కొన్ని ట్యాంకర్లు మాత్రమే భారత్‌కు చేరుకోగా శనివారం ఈ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన రెండు భారత నౌకలపై దాడులు జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ

# గాయాల పునాదులపై నేపాల్ పునర్నిర్మాణం

మొదటి పేజీ తరువాం

వేస్తున్నది. నేపాల్‌లో గతేడాది జరిగిన జెన్ జీ తిరుగుబాటులో ఆ దేశ యువతకు శారీరక గాయాలే కాదు, ఆ దేశానికి మానసికంగా గాయాలయ్యాయి. శారీరక గాయాలు మానినప్పటికీ, మానసికంగా తగిలిన గాయాలింకా పచ్చిగానే ఉన్నాయి. 'ఆ గాయాల పునాదులపైనే దేశాన్ని పునర్నిర్మిస్తాం, ఆ గాయాలను భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అద్భుతమైన మార్పు గా మలుస్తాం' అని నాడు జెన్‌జీ ఉద్యమం లో కీలకపాత్ర పోషించిన బబ్లూగుప్తా ఆశాభా వం వ్యక్తం చేశారు. ఉద్యమం అనంతరం ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో గుప్తా మంత్రిగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన అతిపిన్న వయస్కుడైన క్యాబినెట్ సభ్యుడిగా గుర్తింపు పొందడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అవినీతి, బాధ్యతారాహిత్యం, అధికార పీఠాన్ని పట్టుకొని వేలాడు తున్న పాత తరం రాజకీయ వర్గాలపై పెరుగుతున్న అసంతప్తి తదితర కారణాల నేపథ్యంలో యువత అసంతృప్తిగా ఉన్న సమయంలో నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమం పురుడుపోసుకుం ది. ఈ ఉద్యమం ప్రపంచానికి ఒక మార్గదర్శంగా నిలిచింది. ఆ తర్వాత ఈ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని ఇండోనేషియా, పెరూ, టోగో దేశాల్లో నిరసనలు చెలరేగాయి. మొరా కో, కెన్యా, ఫిలిప్పీన్స్ లాంటి దేశాల్లో యువత పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించింది. ఈ నిరసనలను ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో ప్రపంచవ్యాప్తంగా యువత సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. నేపాల్‌లో నాయకత్వ మార్పు జరిగిన కొన్ని వారాలకే మడగాస్కర్‌లోనూ ఇలాంటి పరిణామమే చోటుచేసుకుంది. యువత ఉద్యమం మూలంగా ఆ దేశ అధ్యక్షుడు దేశం విడిచివెళ్లేల్సి వచ్చిందిఅయితే, వాస్తవ పరిస్థితులను ఆ తర్వాతి నెలలు కండ్లకు కట్టినట్టు స్పష్టం చేశాయి. బంగ్లాదేశ్‌లో 2024లో యువత పెద్ద ఎత్తున చేసిన ఉద్యమం విజయవంతమైనప్పటికీ, ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో ఆ దేశ ఓటర్లు సంప్రదాయ పార్టీకే మద్దతిచ్చారు. మడగాస్కర్‌లో అవినీతి ఆరోపణల నేపథ్యంలో తాత్కా లిక ప్రభుత్వాన్ని సైనిక నాయకుడు రద్దు చేశా రు. దీంతో నిరసనలు చాలా తగ్గిపోయాయి. అంతకుముందు మావోయిస్టు తిరుగుబాటును, 18 సంవత్సరాల క్రితం రాచరికాన్ని రద్దుచేసిన నేపాల్ మాత్రం ఇందుకు భిన్నంగా నిలిచింది. యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఓటర్లు కూడా యువ నాయకత్వానికే మద్దతిచ్చి తమ ప్రత్యేకతను చాటుకున్నది. కాఠ్మాం డ్ మాజీ మేయర్ అయిన 35 ఏళ్ల బాలేంద్ర షా ఈ ఏడాది మార్చి 27న నేపాల్ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పుడి ప్పుడే పురుడుపోసుకుంటున్న యువతరం ఉద్యమాలకు ప్రతీకగా నిలిచారు. నూతన ప్రభుత్వం కొలువైన వెంటనే నిరసనకారుల మరణాలపై విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో 'ఇప్పటి నుంచి దేశం సరికొత్త దిశలో ముందుకు సాగుతుంది' అని జెన్‌జీ ఉద్యమాన్ని ముందుండి నడిపిన సామాజిక కార్య కర్త, ప్రస్తుత హోంమంత్రి సుదన్‌గురుంగ్ సోషల్ మీడియాలో పేర్కొంటూ యువతరంలో సరికొత్త ఆశలను చిగురించారు.

# రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఆశపడుతున్నది. అయితే ఆమెను ఎలాగైనా గద్దెదించి తొలిసారిగా బెంగాల్ పీఠం ఎక్కాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నది. ఇటీవల 'సర్' పేరిట రాష్ట్రంలో 91 లక్ష ఓట్ల తొలగింపుపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుందియూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేస్తామని, చొరబాట్లను అడ్డుకుంటామని, ఉద్యోగాలు కల్పిస్తామని, సరిహద్దులను పటిష్టం చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏను చెల్లిస్తామని కమలం పార్టీ ఈ ఎన్నికల్లో ప్రధానంగా హామీ ఇచ్చింది. ముఖ్యంగా హిందూ ఓట్లపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. సర్ పేరిట అక్రమంగా ఓట్ల తొలగింపునకు పాల్పడిందని, బీజేపీ అధికారంలోకి వస్తే మాంసం, చేపలు, గుడ్లు తినడంపై నిషేధం విధిస్తుందని టీఎంసీ ఆరోపించింది. తాము మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీనిచ్చిందితమిళనాడులో త్రిముఖ పోటతమిళనాడులో ఈసారి తొలిసారిగా టీవీకే పార్టీ అధికార, విపక్షాలకు చెమటలు పట్టిస్తున్నది. ఆయన అధికారంలోకి వచ్చే అవకాశాలు లేకపోయినప్పటికీ రెండు కూటముల సీట్లను భారీగా చీల్చవచ్చునని అంచనా వేస్తున్నారు.

## పోలవరం ఏ 45.72 మీటర్లు

మొదటి పేజీ తరువాయి

గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు పూర్తి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆయన పోలవరంలో పర్యటించడానికి ముందు.. తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తులో 115 టీఎంసీల నిల్వకే ప్రాజెక్టును పరిమితం చేసే గణాంకాలు పీపీఏ వెబ్‌సైట్‌లో కనిపించేవి. ఆయన పర్యటన తర్వాత పోలవరం చిత్రమే పూర్తిగా మారిపోయింది. రెండో దశలో 45.72 మీటర్ల కాంటూరులో నీటి నిల్వకు అవసరమయ్యే కేంద్ర అటవీ పర్యావరణ అనుమతులు, స్టాప్ వర్క్ ఆర్డర్ ఎత్తివేత వంటివాటిపై జలశక్తి శాఖ చర్యలు తీసుకుంటుందని కాంతారావు స్వయంగా వెల్లడించారు. భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలనూ కేంద్రమే చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ క్రమంలోనే గరిష్ఠ మట్టం 45.72 మీటర్ల కాంటూరులో నీటిని నిల్వ చేస్తున్నట్లుగా పీపీఏ తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. దరిమిలా.. పోలవరం మొదటి దశ పనులు పూర్తి కానున్నందున.. రెండో దశకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నామన్న సంకేతాలను జలశక్తి శాఖ ఇచ్చినట్లయిందని అధికార వర్గాలు అంటున్నాయివచ్చే ఏడాది జూన్‌కల్లా తొలి దశ పూర్తి..పోలవరం తొలిదశ పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని జల వనరుల శాఖ ధీమాగా చెబుతోంది. 2454 మీటర్ల పొడవైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు అప్పటికల్లా పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ అంటోంది. 141.435 క్యూమెక్‌ల (50 లక్షల క్యూసెక్కుల) గోదావరి జలాలను బయటకు వదిలే సామర్థ్యంతో 1118.40 మీటర్ల పొడవైన స్పిల్‌వేను ఇప్పటికే నిర్మించారు. 181.999 కిలోమీటర్ల ఎడమ ప్రధాన కాలువ ద్వారా పరీవాహక ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. 178.81 కిలోమీటర్ల కుడి ప్రధాన కాలువ ద్వారా 3.2 లక్షల ఎకరాలకు సాగునీందుతుంది. 45.72 మీటర్ల (150 అడుగుల) ఎత్తులో 194.6 టీఎంసీల చొప్పున రెండు దఫాలుగా 389.2 టీఎంసీలను నిల్వ చేసుకునే వీలుంటుంది. ప్రాజెక్టు పూర్తయితే మొత్తంగా 10.13 లక్షల ఎకరాల గోదావరి, 13 లక్షల ఎకరాల కృష్ణా ఆయకట్టును స్థిరీకరించే వీలుంటుంది. కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీలు, 23.44 టీఎంసీలు పరిశ్రమలకు అందుతాయి. 611 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి తాగునీరు దక్కుతుంది. 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. భూసేకరణకు భారీ ఖర్చు..రెండో దశ చేపడితే ప్రధాన కట్టడాల నిర్మాణాల్లో ఎలాంటి మార్పూ ఉండదు. కానీ భూసేకరణ వ్యయం భారీగా పెరుగుతుంది. 80 వేల ఎకరాలను సేకరించాల్సి ఉంటుంది. మొత్తంగా 8 రెవెన్యూ మండలాల్లో 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతాయి. 85,962 నిర్వాసిత కుటుంబాల తరలింపునకు భూసేకరణ, సహాయ పునరావాసానికి, రూ.28,561.43 కోట్లు అవసరమవుతాయి. రెండు దశల్లో కలిపి మొత్తం నిర్వాసిత కుటుంబాలు 1,06,008 ఉంటాయని అంచనా.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ప్రజలకు అవగాహన కల్పించాలి.

**ఏఐటీయూసీ గ్రామస్థాయి కమిటీలు వేసేందుకు ప్రయత్నం చేయాలి.**
**ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య**

విజయనగరం: (ప్రజాస్వామ్యం) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఏఐటీయూసీ గ్రామస్థాయి కమిటీలు వేసేందుకు ప్రయత్నం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అన్నారు మంగళవారం ఏఐటీయూసీ జిల్లా 12వ మహాసభల రెండవ రోజు ప్రతినిధుల సభ స్థానిక అమర్ భవన్ లో నిర్వహించారు ముందుగా ఏఐటియుసి పతాక ఆవిష్కరణ చేసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన ఏఐటీయూసీ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్మికులతో పాటు ప్రజలందరికీ తెలియపరచి వారికి అండగా ఉండాలన్నారు సైతం కమిటీలు వేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల పని చేస్తున్న స్కీం వర్కర్లు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎంతోమంది అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి కార్మికులకు అనేక ఇబ్బందులు గురి చేయడమే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడానికి మాత్రమే ఉన్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలంటే ఏఐటియుసి కార్మిక సంఘం జిల్లాలో బలపడాలన్నారు. ప్రతినెల ఏఐటియుసి కార్మిక సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఏ కష్టం వచ్చినా కార్మికుల పక్షాన ఏఐటీయూ ఉన్నాదన్న విషయాన్ని






కల్పించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు మాట్లాడుతూ 106 సంవత్సరాల చరిత్ర గల ఎఐటియుసి తో తన ప్రస్థానం మొదలైంది అన్నారు. కార్మికులు కష్టాల్లో ఉన్నారంటే తాను ముందుంటానన్నారు. రానున్న కాలంలో ఐక్య పోరాటాలు చేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి వి కొండలరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలందరికీ తెలియ పరచి వారిని చైతన్య పరచాలన్నారు. దేశంలో ఉన్న కార్మికులంతా ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వచ్చిన దగ్గర నుండి కార్మికులు రోజురోజుకీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పంచాయతీల్లో ఏఐటీయూసీ కొత్త సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత కార్మికులకు ఏమి చేశారో చెప్పాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఓ మ్మి రమణ మాట్లాడుతూ సిపిఐ పార్టీ కార్మికుల పక్షాన ఎన్నడు ఉంటుందన్నారు వారు చేసే ప్రతి పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె స్రవంతి, పురం అప్పారావు, దేగల అప్పలరాజు, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, మునకాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

## మే 15 వరకు మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు




విజయనగరం, :మోకాలు చిప్ప మార్పిడి శస్త్రచికిత్సపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పట్టణంలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ శివాజీ పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ శస్త్రచికిత్సను ఇప్పటివరకు అత్యంత ఖరీదైనదిగా భావించినప్పటికీ, ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారుసాధారణంగా రూ.2 లక్షల వరకు ఖర్చయ్యే మోకాలు మార్పిడి శస్త్రచికిత్సను తమ ఆసుపత్రిలో కేవలం రూ.1 లక్షకే అందిస్తున్నామని వెల్లడించారు. "నీ జాయింట్ మార్పిడి ఆపరేషన్ మహో త్సవం" పేరిట ఈనెల 15 నుండి మే 15 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారుకంపెనీల నుండి నేరుగా మోకాలు చిప్పలను కొనుగోలు చేసి, అదే ధరకు రోగులకు అమర్చడం ద్వారా ఖర్చు తగ్గించామని చెప్పారు. మోకాలు అరుగుదల సమస్యను చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారని, ముఖ్యంగా 65 సంవత్సరాల తర్వాత మందులతో పెద్దగా ప్రయోజనం ఉండదని, అవసరమైన వారు శస్త్రచికిత్సను ఆలస్యం చేయకుండా చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి ఆసుపత్రి ఎండి డి. రమేష్ అధ్యక్షత వహించగా, డాక్టర్ జాదన్ కూడా పాల్గొని ప్రసంగించారు.

## ఏఓబి చెక్‌పోస్ట్ వద్ద శక్తి టీం




పాతపట్నం, : మండలంలోని ఆంధ్ర--ఒడిశా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద టెక్కలి సబ్‌డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీజీపీ కార్యాలయం మంగళగిరి మార్గదర్శకాలు, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, రోడ్డు ప్రమాదాల సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, పోలీస్ హెల్ప్‌లైన్ సేవలను ఎలా వినియోగించుకోవాలి అనే విషయాలపై ప్రజలకు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగం, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ వెంట ఉంచుకోవాల్సిన బాధ్యత గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా, మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రాణాపాయ పరిస్థితులు, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల వచ్చే ప్రమాదాలపై ప్రజలకు స్పష్టంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు --- నేషనల్ హైవే 1033, పోలీస్ 112, మహిళల కోసం 181, 1091 --- గురించి తెలియజేశారు .సైబర్ మోసాల నివారణకు 1930 హెల్ప్‌లైన్ ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల నివారణకు 1972, బాల్య వివాహాలు మరియు బాల కార్మికుల సమస్యలపై 1098 నంబర్ల వినియోగం గురించి విద్యార్థులు, ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే, వేధింపులు, గృహహింస, పోక్సో కేసులపై కూడా చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కోటబొమ్మలి హెడ్ కానిస్టేబుల్ డి. శ్రీనివాసరావు, మహిళ కానిస్టేబుల్ కే. చామంతి, చెక్‌పోస్ట్ సిబ్బంది హెడ్ కానిస్టే బుల్ ఎం. శ్యామలరావు, కానిస్టేబుల్ శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని క నిర్వహించారు.

## విజయవంతంగా పోషన్ పక్వాడా




తెర్లాం,: పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళ వారం స్థానిక అంగన్వాడి కేంద్రం-2 లో విజయవంతంగా నిర్వహించారు . బాడంగి ఐసిడి ఎస్ సిడిపిఓ సుజాత, సూపర్వైజర్ ఈశ్వరమ్మ సూచనల మేరకు అంగన్వాడి కార్యకర్తలు ర్యాలీతోపాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్త జి లక్ష్మి మాట్లాడుతూ జింక్ ఫుడ్ వద్దు ఇంటి ఫుడ్ ముద్దు అన్న నినాదాన్ని ప్రీస్కూల్ పిల్లలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం తీసుకోవాలని పోషణ అభియాన్ పథకం పైన పలు సూచనలు అందించారు. అలాగే బాల్యవివాహాలు జరగకుండా తల్లిదండ్రులు, పెద్దలు బాధ్యత వహించాలని కార్యక్రమానికి సంబందించిన పలు రకాల స్లోగన్లు వినిపించారు. కార్యక్రమంలో వారితో పాటు అంగన్వాడి కార్యకర్తలు జి, లక్ష్మి సునీత తదితర కార్యకర్తలతో పాటు ఆయాలు, గర్భిణీలు, బాలింతలు ప్రీస్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

# సిహెచ్సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ - ఎస్ . రామ సుందర్ రెడ్డి

### పరిశుభ్రత లోపిస్తే కాంట్రాక్ట్ రద్దు

ప్రజాస్వామ్యం / ?బాడంగి, (విజయనగరం) : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి)ను జిల్లా కలెక్టర్ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారుతొలుత ఓపీ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, అనంతరం వార్డులను





క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు వ్యాధులు తగ్గాల్సింది పోయి, అపరిశుభ్రత వల్ల కొత్త రోగాలు వచ్చేలా ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. ?పరిశుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోపు ఆసుపత్రి అంతటా పరిశుభ్రత మెరుగుపడాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా మార్పు రాకపోతే సదరు కాంట్రాక్ట్ను తక్షణమే రద్దు చేసి, బాధ్యతలను వేరే వారికి అప్పగిస్తామని స్పష్టం చేశారు."ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యంతో పాటు ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండటం అత్యంత ముఖ్యమనీ, ఇందులో ఎలాంటి రాజీ పడకూడదనీ కలెక్టర్ పేర్కొన్నారు.



### ఐఐటి కి అర్హత సాధించిన
## డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి గొంప సాయి



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం ప్రతిష్టాత్మకమైన ఐఐటి మద్రాస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ (బి.ఎస్) కోర్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి గొంప సాయి అర్హత సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేఖ ఒక ప్రకటన లో తెలియచేసారు. బి ఎస్సి (మాథ్స్ ) మొదటి సంవత్సరం చదువుతున్న సాయి తాజా యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ఇప్పుడు డ్యుయల్ డిగ్రీ మార్గాన్ని అనుసరించనున్నాడు. ప్రస్తుతం బి.ఎస్సి రెగ్యులర్ విధానం మరియు ఐఐటి మద్రాస్ నుండి బి ఎస్ డేటా సైన్స్ (ఆన్లైన్ విధానం)లోను చదవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా గొంప సాయికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేఖ, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె.వి విద్యాసాగర్, అధ్యాపక బృందం, సహచర విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

### కేథరిన్ లో ముగిసిన
## సబ్ జూనియర్ బేస్ బాల్ సెలక్షన్స్



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం స్థానిక కేథరిన్ స్కూల్ మైదానంలో నిర్వహించిన 'బేస్ బాల్' సబ్ జూనియర్ సెలక్షన్స్ ఘనంగా ముగిసాయని కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలివర్ రాయి తెలియజేశారు. బాలికల విభాగం నుంచి 60 మంది, బాలుర విభాగం నుంచి 70 మంది హాజరుకాగా వీరిలో 16 మంది బాలికలు, 16 మంది బాలురును సెలెక్షన్ కమిటీ ఎంపికచేశారు. ఎంపికైన 32 మంది బాల, బాలికలను ఆలీవర్ రాయి అభినందించారు. వీళ్ళందరూ కర్నూల్ లో మే 5, 6, 7 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.

## అవంతి కళాశాలలో నిర్వహించిన పాలిటెక్నిక్ నమూనా పరీక్షకు విశేష స్పందన



తగరపువలస, ప్రజాస్వామ్యం తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిసెట్ (పాలిటెక్నిక్ ) ఎంట్రన్స్ పరీక్ష వ్రాసే విద్యార్థుల కోసం పాలీసెట్ (పాలిటెక్నిక్) నమూనా పరిక్షను మంగళవారం నిర్వహించినారు. ఈ పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 310 మంది విద్యార్థులు హాజరైనారు. ఈ పరీక్షలో కె.లోహేంద్ర, జెడ్.పి.హై స్కూల్, జరజారావుపేట, నెల్లిమర్ల విద్యార్థికి 112/120 మార్కులు సాధించి ప్రథమ స్థానంలోను, జి. హేమలత, కేథరిన్ స్కూల్, భీమిలి విద్యార్థినికి 111/120 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలోను, అలాగే పి. వైశాలి, కేథరిన్ స్కూల్, భీమిలి విద్యార్థినికి 110/120 మార్కులు సాధించి తృతీయ స్థానంలోను నిలిచారు. అవంతి కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.3500, రూ.2,500 మరియు రూ.2,000 నగదు బహుమతులను ప్రిన్సిపాల్ డా.బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఏ. చంద్రశేఖర్ డిప్లొమా ఇంచార్జి ప్రిన్సిపాల్ బి. జగదీశ్వరరావు, శేష అందచేశారు.

## ప్రాజెక్టుల భూసేకరణ త్వరగా పూర్తిచేసి భూములు అప్పగించాలి

### జిల్లా కలెక్టర్ - ఎస్. రాంసుందర్ రెడ్డి

ప్రజాస్వామ్యం / విజయనగరం: జిల్లాలో కొనసాగుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్వే లైన్లు మరియు జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ ప్రాజెక్టుల వారీగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తోటపల్లి, తారకరామ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపై సమీక్షించారు. ?రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ, విజయనగరం - సంబల్పూర్ మూడవ లైన్ పనులు,





కొత్తవలస - విజయనగరం నాలుగో లైన్ మరియు ఖుర్దా రోడ్ - విజయనగరం మూడవ లైన్ పనులకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు, స్ట్రక్చర్ వ్యాల్యూయేషన్ రిపోర్టులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులైన ఎన్ .హెచ్.-516డీ (పెందుర్తి - బొబ్బిలి) మరియు ఎన్హెచ్-130 సి డి (రాయ్పూర్ - విశాఖపట్నం) పనులకు భూసేకరణ అవార్డులు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తయ్యేలా రెవెన్యూ మరియు రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో ఆదేశించారు. మున్సిపాల్టీల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం కోసం ప్రతిపాదించిన ఎస్టీపీలకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ సేథు మాధవన్, డిఆర్వో సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు వివిధ శాఖల ప్రతినిధులు, తహసీల్దార్లు, ఎల్ఏ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.


## క్రీడా మైదానంలో అట్టహాసంగా జి.పి.ఎల్ - 3 ఆక్షన్ కార్యక్రమం

### --- జి.పి.ఎల్ - 3 ఆక్షన్ లో పాల్గొన్న ఐదు జట్లు

ప్రజాస్వామ్యం / గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మరో క్రికెట్ సంబరానికి వేదిక కానుంది. కొద్ది రోజులలో జరగబోయే జి.పి.ఎల్ - 3 సంబరానికి ఆక్షన్ కార్యక్రమం జరిగింది. జి.పి.ఎల్ - 1 2023 వ సంవత్సరం వేసవికాలంలో జరిగింది. జి.పి.ఎల్ - 2 2026 సంక్రాంతి సందర్భంగా జరగగా,జి.పి.ఎల్ - 3 , 2026 ఏప్రిల్ 26 లేదా 27 వ తేదీల్లో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు విలేకరులకు తెలియజేశారు గజపతినగరం క్రీడా మైదానంలో జి.పి.ఎల్ -3 కి సంబంధించి ఆక్షన్ కార్యక్రమం సోమవారం (20--04-2026) సాయంత్రం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు జరిగింది. ఈ ఆక్షన్ కార్యక్రమంలో సుమారు 65 నుంచి 70 మంది ఆటగాళ్ల కొనుగోలు కోసం ఐదు జట్లు పోటీపడ్డాయి.

జట్ల వివరాలు :





1). డ్రీమ్స్ బ్రోస్ 11 , 2). లక్ష్మి ఎంటర్ప్రైజెస్ , 3). మహేష్ వారియర్స్, 4). శ్రీ వెంకటేశ్వర క్యాటరింగ్ లెవెన్స్, 5). ఉదయ్ - నితిన్ సూపర్ కింగ్స్. ఆక్షన్ లో లక్ష్మీపతి బాలాజీని అత్యధికంగా 4,900 పాయింట్లతో మహేష్ వారియర్స్ దక్కించుకోగా, చాణక్య ను 4800 పాయింట్లు , మజ్జిసాయి ను 4400 పాయింట్లతో శ్రీ వెంకటేశ్వర క్యాటరింగ్ 11'o జట్టు దక్కించుకుంది. జి.పి.ఎల్ - 3 క్రికెట్ క్రీడా పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు . జి.పి.ఎల్ - 3 వేసవి సెలవుల్లో జరుగుతుండడంతో గజపతినగరం చుట్టుప్రక్కల ప్రాంతాలకు సంబంధించిన యువత, వివిధ గ్రామాల ప్రజలు ఈ క్రికెట్ సంబరాన్ని అధిక సంఖ్యలో వీక్షించే అవకాశం ఉందని నిర్వాహకులు ఆశిస్తున్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ ఆటగాళ్లుకర్రీ నానాజీ , తాడి శ్రీనివాసరావు,శిరిపూరి శ్రీనివాసరాజు , రాజగోపాల్, తోనంగి శ్రీను, డివిఆర్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ లో క్రీడల సందడి - వేసవి శిబిరాలు కు సిద్ధం కావాలి

**ముఖ్య అతిథిగా జిల్లా ఒలింపిక్స్ గౌరవ ఛైర్మన్ గణబాబు... గణబాబు కు పుష్పగుచ్చం అందించి స్వాగతించిన కార్యదర్శి చినబాబు...**

విశాఖపట్నం ప్రజాస్వామ్యం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విశాఖ నగరవ్యాప్తంగా అన్ని క్రీడల్లో సమ్మర్ క్యాంప్లను ఘనంగా నిర్వహించాలని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, (జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవ ఛైర్మన్ ) గణబాబు పిలుపునిచ్చారమంగళవారం జీవీఎంసీ మరియు శాప్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా అసోసియేషన్ లతో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సూర్యనారాయణ,జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఎమ్మెల్యే గణబాబు కు పుష్పగుచ్చం అందజేసి సాదరంగా ఆహ్వానించారసమావేశం లో బాగంగా విశాఖ నగరం మరియు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సమ్మర్ క్రీడా శిబిరాలను ఏర్పాటు చేసవిద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచేలా శిబిరాలు ఉండాలని తెలిపారు.అన్ని క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేసి ఈ సమ్మర్ క్యాంప్లను విజయవంతం చేయాలని కోరారఈ



సమావేశంలో నగరంలోని వివిధ క్రీడా అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడా అధికారులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బాబు పుట్టిన రోజు సందర్భంగా
## మెగా రక్తదాన శిబిరం

### --- 57 వ సారి రక్తదానం చేసిన డి.వి.ఆర్మాస్టారు.





ప్రజాస్వామ్యం/బొండపల్లి, (గజపతినగరం):ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76 వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమ వారం మండలంలోని నెలివాడ ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి శ్రీ కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. "రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడం ద్వారా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాజానికి, యువతకు ఆదర్శంగా నిలిచారు " . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అలుపెరుగని నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఆయన పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానంతో సమానమని, యువత ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి నియోజకవర్గ స్థాయి నుంచి భారీగా స్పందన లభించింది. ఈ మెగా రక్తదాన శిబిరంలో 316 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. ముఖ్యంగా డివిఆర్ మాస్టారు 57 వ సారి రక్తదానం చేయడం ఈ రక్తదాన శిబిరం లో జరిగిన గొప్ప విషయం . ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు , మెడికల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



### అన్ని జిల్లా
## కేంద్రాల్లోనూ బిసి భవన్లు

**విశ్వబ్రాహ్మణుల కోసం మంగళగిరిలో శిక్షణ కేంద్రం : మంత్రి సవిత**



అనంతపురం : రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బిసి భవన్లు నిర్మించనున్నట్లు రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలక మండలి సభ్యుల అభినందన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అన్ని జిల్లా కేంద్రాల్లో బిసి భవన్ల ఏర్పాట్లకు గతంలో రూపొందించిన అంచనాలను సవరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో విశ్వ బ్రాహ్మణులకు ఆధునిక పరికరాలు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. మారుతున్న కాలంతో పాటు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా విశ్వ బ్రాహ్మణులకు శిక్షణ ఇవ్వడానికి మంగళగిరిలో స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. విశ్వ బ్రాహ్మణుల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ, విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలక మండలి సభ్యులను మంత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పార్వతమ్మ, కూటమి నాయకులు, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.



# రెడ్ హాట్ పాలక్ బ్యూటీ

బాలీవుడ్‌లో సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ప్రారంభించి నముద్దుగుమ్మ పాలక్ తివారీబాలీవుడ్‌లో సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ప్రారంభించి నముద్దుగుమ్మ పాలక్ తివారీ. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. అంతిమ్ సినిమాకు సహాయ దర్శకురాలిగా వర్క్ చేస్తున్న సమయంలోనే ఈమెలో నటిని గమనించిన కొందరు ఆ దిశగా ప్రయత్నాలు చేయమని సలహా ఇచ్చారట. దాంతో ఈ అమ్మడు మెల్లగా మోడలింగ్, యాక్టింగ్ వైపు మళ్లింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. మోడలింగ్‌లోనూ దూసుకు పోతుంది. చాలా తక్కువ సమయంలో సోషల్ మీడియాలో మంచి పాపులారిటీని ఈ అమ్మడు దక్కించుకుంది. హీరోయిన్స్‌కి ఏ స్థాయిలో ఇన్‌స్టాలో ఫాలోవర్స్ ఉంటారో ఆ స్థాయిలో ఈ అమ్మడికి ఫాలోవర్స్ ఉన్నారు అంటే ఈమె ప్రతిభ, అందం ఏంటో అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు ట్రెండ్ కావడం మనం చూస్తూనే ఉన్నాసల్మాన్ ఖాన్ హీరోగా నటించిన..ఇండస్ట్రీలో ఉన్న సంబంధాల కారణంగా సహాయ దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాలక్ తివారీ 2023లో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమాలో కీలక పాత్రలో కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత బిజ్లీ బిజ్లీ అనే మ్యూజిక్ వీడియోను చేయడం ద్వారా మరింతగా సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక రోసీ సినిమాలో నటించిన ఈమెకు నటిగా మరింత మంచి మార్కులు దక్కాయి. సోలో హీరోయిన్‌గా సినిమాలు చేయడం కోసం వెయిట్ చేస్తున్న ఈ అమ్మడు మరో వైపు మోడలింగ్ చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా ఫోటోలను, వీడియోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 50 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న పాలక్ తాజాగా మరో అందాల ఆరబోత ఫోటో షూట్ ను చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది.రెడ్ డ్రెస్‌లో పాలక్ తివారీ..సాధారణంగా ముద్దుగుమ్మలు రెడ్ డ్రెస్‌లో కన్నుల విందు చేయడం మనం చూస్తూ ఉంటాం. ఇక పాలక్ తివారీ అంతకు మించి అన్నట్లుగా అందాల ఆరబోత చేయడం ద్వారా కన్నుల పండుగ అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ పాలక్ తివారీ సొంతం. అందుకే ఈ రెడ్ డ్రెస్‌లో అంతకు మించి అన్నట్లుగా అందంగా, ఆకర్షణీయంగా పాలక్ కనిపిస్తోందని నెటిజన్స్, ముఖ్యంగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. గతంలోనూ పాలక్ అందాల ఆరబోత ఫోటోలు, మోడలింగ్ ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ స్థాయిలో ఆ ఫోటోలు అందంగా కనిపించలేదని, ఈసారి రెడ్ హాట్ అన్నట్లుగా అనిపిస్తోంది ఇంత అందంగా ఉన్న ఈ అమ్మడికి ఎందుకు బాలీవుడ్ నుంచి బల్క్ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారఇబ్రహీం ఖాన్‌తో పాలక్ ప్రేమాయణం...శ్వేతా తివారీ, రాజా చౌదరి ల కుమార్తె అయిన పాలక్ తివారీ మహారాష్ట్రలోని ముంబైలో జన్మించింది. చిన్నప్పటి నుంచి ఇండస్ట్రీలోనే ఉండటం వల్ల సహజంగానే సినిమాలపై ఆసక్తి ఏర్పడింది.




## నరసింహ సక్సెస్.. పరశురామ్ పై భారంగా మారిందా?

మార్కెటింగ్ యాంగిల్‌లో చూస్తే, గ్లింప్స్‌ను ముందుగానే రిలీజ్ చేయడం వెనుక స్ట్రాటజీ కూడా ఆసక్తికరంగా కనిపిస్తోంది.గతేడాది భారతీయ సినీ పరిశ్రమలో అనూహ్య సంచలనంగా నిలిచిన మహావతార నరసింహ సక్సెస్‌తో, యానిమేషన్ జానర్‌కు కొత్త ఊపిరి లభించింది. పెద్దగా అంచనాలు లేకుండా రిలీజైన ఈ సినిమా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం మాత్రమే కాదు, కంటెంట్ బలం ఉంటే యానిమేషన్ సినిమాలకు కూడా భారీ మార్కెట్ ఉందని నిరూపించింది. ఈ సక్సెస్‌తో సహజంగానే తదుపరి భాగం మహావతార పరశురామ్‌పై అంచనాలు అమాంతం పెరిగాయి. అయితే రీసెంట్ గా రిలీజైన గ్లింప్స్ ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉన్నాయా అనే ప్రశ్న ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిందిగ్లింప్స్ కు మిక్స్డ్ రెస్పాన్స్‌గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మిక్స్డ్ టాక్ కనిపించింది. ముఖ్యంగా విజువల్స్ క్వాలిటీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విజువల్స్ అసలు యానిమేషన్‌లా లేదు, ఏఐతో చేసిన వీడియోలా ఉందంటూ కొంతమంది నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఇటీవలి కాలంలో పురాణాల ఆధారంగా ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. అదే స్టైల్‌ను ఈ గ్లింప్స్‌లోనూ గుర్తిస్తున్నామని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, నిజంగా గ్లింప్స్‌లో ఏఐ వాడారా? లేదా అనేది క్లారిటీ రాకపోయినా, ఈ డిస్కషన్ మాత్రం సినిమాపై ఆసక్తిని పెంచడంలో కీలకంగా మారింది. ఒకవైపు ట్రోలింగ్ ఉంటే, మరోవైపు ఇది కేవలం గ్లింప్స్ మాత్రమేనని, సినిమా ఫైనల్ ప్రొడక్ట్ మాత్రం మెరుగ్గా ఉంటుందంటూ చిత్ర యూనిట్ కు సపోర్ట్ చేస్తున్నారుసినిమాపై ఫ్రాంచైజ్ ప్రెజర్ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఫ్రాంచైజీ ప్రెజర్. ఒకసారి భారీ హిట్ సాధించిన సినిమాకు సీక్వెల్ రూపొందించడం అంత సులభం కాదు. మొదటి భాగం సక్సెస్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను సృష్టిస్తుంది. అదే అంచనాలను అందుకోలేకపోతే, తర్వాత రియాక్షన్ మరింత తీవ్రంగా మారుతుంది. గతంలో బాహుబలి, కేజీఎఫ్ వంటి ఫ్రాంచైజీలు ఈ ఒత్తిడిని సక్సెస్‌ఫుల్ గా మేనేజ్ చేసి మరింత పెద్ద విజయాలను సాధించాయి. ఇప్పుడదే తరహా ప్రెజర్ మహావతార ఫ్రాంచైజీపై కూడా పడుతోంది. నరసింహ స్థాయి విజువల్స్, ఎమోషన్, నేరేషన్.. వీటన్నింటినీ ఆడియన్స్ ఈ సినిమాలోనూ ఆశిస్తున్నారుమార్కెటింగ్ యాంగిల్‌లో చూస్తే, గ్లింప్స్‌ను ముందుగానే రిలీజ్ చేయడం వెనుక స్ట్రాటజీ కూడా ఆసక్తికరంగా కనిపిస్తోంది. ఇది కేవలం హైప్ క్రియేట్ చేయడానికేనా? లేక ఆడియన్స్ రియాక్షన్ ను అంచనా వేసి, ఫైనల్ అవుట్‌పుట్‌లో మార్పులు చేయడానికా? అన్న చర్చ నడుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే, నెటిజన్ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను టీమ్ పాజిటివ్‌గా తీసుకుని, సినిమాను మరింత మెరుగుపరచే అవకాశం ఉంది.బాక్సాఫీస్ పరంగా కూడా మహావతార్ పరశురామ్ పై భారీ అంచనాలు ఉన్నాయి. మహావతార్ నరసింహ రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన నేపథ్యంలో, ఈ సీక్వెల్ ఆ రికార్డును క్రాస్ చేస్తుందా అన్నది ఆసక్తికర అంశంగా మారింది. అయితే ఈ టార్గెట్ ను చేరుకోవాలంటే, కేవలం హైప్ సరిపోదు. క్వాలిటీ కూడా అదే స్థాయిలో ఉండాలి. మొత్తం మీద చూస్తే, మహావతార పరశురామ్ ప్రస్తుతం అంచనాలు, వివాదాలు, ప్రెజర్ అన్నీ కలిసిన ఒక క్రిటికల్ దశలో ఉంది. ఈ ప్రెజర్‌ను టీమ్ ఎలా హ్యాండిల్ చేస్తుందో అదే ఈ ఫ్రాంచైజీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.



## నువేక్షా స్టైలిష్ లుక్స్‌కు నెటిజన్స్ ఫిదా!

ఈ ఫోటోషూట్‌లో నువేక్షా వేసుకున్న డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైట్ ర్యాప్ డ్రెస్, నడుము భాగంలో కట్-అవుట్ డిజైన్, దానికి తోడు గోల్డ్ హార్డ్‌వేర్ యాక్సెంట్స్ ఆమెకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చాయి.లేటెస్ట్ ఫోటోషూట్‌తో నువేక్షా సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. క్రీమ్ వైట్ కట్-అవుట్ డ్రెస్, గోల్డ్ బకిల్ డీటెయిల్స్‌లో ఆమె దేవకన్యలా మెరిసిపోతోంది. నేచురల్ లైటింగ్‌లో దిగిన ఈ ఫోటోలు చూస్తుంటే ఫ్యాన్స్‌కు కళ్లు తిప్పుకోవడం కష్టమవుతోంది. బోల్డ్ అండ్ క్లాసీగా ఉన్న ఈ లుక్, ఆమెలోని సరికొత్త గ్లామర్ యాంగిల్‌ను ఆవిష్కరించింది. స్టైలిష్‌గా కనిపిస్తూనే తనదైన ఇంటెన్సిటీతో అందరినీ ఆకట్టుకుంటోంది ఈ యంగ్ బ్యూటీ. ఆ విశేషాలు మీకోసం..అదిరిపోయే అవుట్‌ఫిట్.. అబ్బురపరిచే అందం:ఈ ఫోటోషూట్‌లో నువేక్షా వేసుకున్న డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైట్ ర్యాప్ డ్రెస్, నడుము భాగంలో కట్-అవుట్ డిజైన్, దానికి తోడు గోల్డ్ హార్డ్‌వేర్ యాక్సెంట్స్ ఆమెకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చాయి. కేవలం బట్టలే కాదు, ఆ డ్రెస్‌ను క్యారీ చేసిన విధానం కూడా చాలా బాగుంది. ఇక ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకోవాలనే తపన ఆమె డ్రెసింగ్ స్టైల్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఈ ఫోటోలు చూసిన వారెవరైనా సరే, నువేక్షా స్టైల్ సెన్స్‌కు



## పారితోషికంలో కొత్త ట్రెండ్: రజనీ బాటలో అల్లు అర్జున్

టాలీవుడ్‌లో ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, మహేష్ బాబు, ఎన్టీఆర్ , రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలు తమ పారితోషికాల విషయంలో ప్యాకేజీ పద్ధతిని పాటిస్తున్నట్లు కథనాలొస్తున్నాయి.ప్రస్తుత కాలంలో భారతీయ సినిమా మార్కెట్ ఊహించని రీతిలో విస్తరించింది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల వసూళ్లు సాధించడమే గగనంగా ఉండేది.. కానీ ఇప్పుడు వందల కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమాలు ఏకంగా వెయ్యి కోట్ల క్లబ్‌ను కూడా సునాయాసంగా టచ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే స్టార్ హీరోల పారితోషికాలు కూడా వందల కోట్లకు చేరుకున్నాయి. అయితే కేవలం ఫిక్స్‌డ్ రెమ్యునరేషన్ మాత్రమే ఆశించకుండా... చిత్ర నిర్మాణంలో భాగస్వాములుగా మారుతూ నిర్మాతల భారాన్ని తగ్గించే సరికొత్త పంథాకు హీరోలు తెరలేపుతున్నారు.టాలీవుడ్‌లో ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, మహేష్ బాబు, ఎన్టీఆర్ , రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలు తమ పారితోషికాల విషయంలో ప్యాకేజీ పద్ధతిని పాటిస్తున్నట్లు సినిమా విడుదలయ్యాక వచ్చే లాభాలలో వాటాలు తీసుకోవడం ద్వారా వీరు నిర్మాతకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఈ విధానం వల్ల సినిమా నిర్మాణ సమయంలో నిర్మాతపై వడ్డీల భారం తగ్గడమే కాకుండా.. సినిమా విజయంలో హీరోలకు కూడా బాధ్యత పెరుగుతోంది.ఈ క్రమంలోనే దక్షిణాది సూపర్‌స్టార్ రజనీకాంత్ పారితోషికం విషయంలో పాటిస్తున్న నిబద్ధత ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రజనీకాంత్ కేవలం ఒక నటుడిగానే కాకుండా.. నిర్మాతలకు అండగా నిలిచిన మొదటి తరం స్టార్ గా గుర్తింపు పొందారు. నిర్మాత జి. ధనంజయన్ అడ్వాన్స్‌గా తీసుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన తర్వాతే పారితోషికం(లాభాల్లో వాటా) తీసుకునేలా ఆయన ఒప్పందాలు చేసుకుంటారని.. నిర్మాతకు నష్టం రాకూడదనేదే ఆయన ప్రధాన ఉద్దేశం.

## పెళ్లి వార్తలపై వెల్లువెత్తిన ఊహాగానాలు!



ప్రముఖ బుల్లితెర నటి జెన్నిఫర్ వింగెట్ అద్భుతమైన నటనతోనే కాదు. వ్యక్తిగత జీవితంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా ఆమె మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. ఆమె సోషల్ మీడియా పోస్ట్‌పై వచ్చిన ఓ ఆసక్తికరమైన కామెంట్ తో ఈ చర్చ మొదలైంది. ఈ కామెంట్ చూసిన అభిమానులు, జెన్నిఫర్ త్వరలోనే జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.విషయంలోకి వెళ్తే జెన్నిఫర్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అందమైన ఫోటోలను పంచుకుంది.ఆ ఫోటోలపై ఆమె సన్నిహితులు , స్నేహితులు చేసిన ఓ కామెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో పెళ్లికి సంబంధించిన ప్రస్తావన ఉండటంతో అది వైరల్‌గా మారింది. జెన్నిఫర్ కూడా ఆ కామెంట్‌కు స్పందించిన తీరు పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. దీంతో ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలపడం మొదలుపెట్టారు. జెన్నిఫర్ వింగెట్ గతంలో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్‌ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత జెన్నిపర్ కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారించింది-బేహద్-, -బేపన్నా- వంటి సీరియల్స్‌తో స్టార్ హోదాను దక్కించుకుంది. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనా? ఎక్కడా వెనకడుగు వేయకుండా నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో మారింది. ఈ ప్రచారంపై జెన్నిఫర్ వింగెట్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022